

చీనీ టన్ను రూ.28 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.28 వేలు, కనిష్టంగా రూ.6,500 ప్రకారం ధర పలికాయి.



ఇళ్ల స్థలాలకు చుక్కల గ్రహణం

ముదిగుబ్బలోని ఇళ్లు నిర్మించుకున్న సర్వే నంబర్లన్నీ చుక్కల భూముల జాబితాలో కనిపిస్తున్నాయి. దీంతో రిజిస్ట్రేషన్లు కాక జనం ఇబ్బంది పడుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
38.3°/19.8°

వాతావరణ మార్పులతో జిల్లా వ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. వేసవితాపం కొనసాగుతోంది. గంటకు 8 నుంచి 12 కి.మీ వేగంతో ఆగ్నేయం దిశగా గాలి వీచింది.

చెప్పింది చేయకుంటే చిత్తడే!

ఉమ్మడి జిల్లాలో పలువురు పోలీసుల తీరు ఇటీవలి కాలంలో తీవ్ర వివాదాస్పదమవుతోంది. 'బాస్'లు కూడా తమకేమీ తెలియనట్లే ఉంటుండటంతో 'పచ్చ' నేతల అడుగులకు మడుగులొత్తడమే పనైపోయింది. శాంతిభద్రతల పర్యవేక్షణ పట్టడం లేదు. ప్రజల రక్షణ సంగతే గుర్తుకు రావడం లేదు. ఎంత సేపూ ఎమ్మెల్యేలు ^1‡ fl}s ˘చేసుకుంటూ పోతున్నారు.



నలిగిపోతున్న నాలుగో సింహం

- ఎమ్మెల్యేలు గీసిన హద్దులే పోలీసులకు లక్ష్మణరేఖలు
- గీత దాటితే శంకరగిరి మాన్యాలు పట్టిస్తామని పరోక్ష హెచ్చరికలు
- ఇటీవల సీఐ కరుణాకర్ ఘటనతో స్థైర్యం కోల్పోయిన పోలీసులు
- ఎస్‌ఐ వీరంగం చేసినా కనీస చర్యలు తీసుకోలేని 'శ్రీ సత్యసాయి' జిల్లా ఎస్పీ
- తాడిపత్రిలో ఐపీఎస్ అధికారి ఆఫీసుకే పరిమితం
- సీఐల కనీస బాధలు పట్టించుకోలేని స్థితిలో పోలీసు బాస్‌లు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: 'నాలుగు గోడల మధ్య బంధిస్తే పిల్లి కూడా పులి అవుతుంది' అని నానుడి. కానీ ఇప్పుడు నాలుగు గోడల వెలుపల ఉన్నా పోలీసులు పులులు కాలేకపోతున్నారు. ఎమ్మెల్యేలే పెద్దపులి పాత్ర పోషించి పోలీసులతో ఆడుకుంటున్నారు. ఎక్కడైనా బాధితులకు న్యాయం చేయడానికి పోలీసులు ఒక అడుగు ముందుకేసినా 24 గంటల్లోనే వేటు తప్పడం లేదు. ఏ నియోజకవర్గంలో అయినా ఎమ్మెల్యేలు గీసిన హద్దులే పోలీసులకు లక్ష్మణ రేఖలుగా మారాయి. గీత దాటారో వేరే స్టేషన్ చూసుకోవాల్సిందే. లేదంటే వీఆర్‌కు పంపించి వేతనం రాకుండా చేస్తారు.. ఇదీ ఉమ్మడి అనంతపురం జిల్లాలో దుస్థితి. 'శాంతిభద్రతలు, రూల్స్, లా ఇవన్నీ మీకెందుకు.. పచ్చచొక్కా వేసుకోస్తే సెల్యూట్ కొట్టు.. లేదంటే పెట్టేబేడా సర్దుకు పోతావ్!' అంటూ ఎమ్మెల్యేలు హెచ్చరిస్తున్నారు.

కరుణాకర్‌కు పట్టిన గతే మీకూ..

సంబంధం లేని పంచాయితీలో తలదూర్చిన ఓ వ్యక్తిని ఇటీవల బుక్కరాయసముద్రం సీఐ కరుణాకర్ మందలించారు. దీంతో 24 గంటలు గడవకముందే ఆయన్ను వీఆర్‌కు పంపించారు. ఎమ్మెల్యే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు. సీఐది కూడా అదే సామాజిక వర్గం. కానీ ఆయన్ను కాపాడుకోవడం అటుంచి వెంటనే వెళ్లగొట్టారు. మిగతా సీఐలకు ఇది హెచ్చరిక అంటూ కొంతమంది ఎమ్మెల్యేలు భావిస్తున్నారు. తమ అనుమతి లేకుండా ఏదైనా చేస్తే కరుణాకర్ లాగే బదిలీపై వెళతారని హెచ్చరిస్తున్నారు. కరుణాకర్ బదిలీతో రెండు జిల్లాల్లోనూ సీఐలు.. ఎస్పీ లేమోగానీ ఎమ్మెల్యేలను కాదని ఏపనీ చేయలేక పోతున్నారు.

బరితెగిస్తే ఓకే..

రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ లాగా బరితెగించి టీడీపీకి బానిసగా ఉంటే ఓకే అన్నట్టు ఉన్నతాధికారులు సంకేతాలిచ్చారు. ఇటీవల 20 మంది గుంపుగా వచ్చి పాపిరెడ్డిపల్లి లింగమయ్యపై దాడిచేస్తే కేవలం ఇద్దరిపైనే కేసు నమోదు చేశారు. ఎంపీపీ ఎన్నికల్లో సుధాకర్ యాదవ్ పసుపు కండువా వేసుకున్నంత పని చేశారు. ఎమ్మెల్యే పరిటాల ఇంట్లో పనిమనిషి కంటే అధ్వానంగా పనిచేశారని పోలీసు వర్గాలే చెబుతున్నాయి. అలాంటి ఎస్‌ఐపై శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ కనీసం చర్యలు తీసుకోలేక పోయారు. సుధాకర్ బరి తెగించి ప్రవర్తిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎస్పీలు తమను రక్షించే పరిస్థితిలో లేరని భావించి సీఐలు కూడా ఎమ్మెల్యేలు చెప్పినట్టే వింటున్నారు.

ఇద్దరూ నిస్సహాయ స్థితిలోనే..

తాడిపత్రిలో ఐపీఎస్ అధికారిని వేసినా పనిచేయలేని పరిస్థితి. జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆగడాలకు హద్దు లేకుండా పోయినా ఎస్పీ జగదీష్ నోరు మెదపలేని దుస్థితి. చివరకు ముస్లిం నేతలు ఇఫ్తార్ విందు చేసుకుంటామన్నా జేసీ ఉండనివ్వలేదు. కనీసం దీనిపై కూడా ఎస్పీ నోరువిప్పలేదు. పుట్టపర్తి నియోజకవర్గంలో రాజకీయ నేతలే రూ. కోట్లలో జూదం ఆడిస్తున్నా చర్యలు అస్సలు కానరావడం లేదు. తాడిపత్రి, గుంతకల్లు నియోజకవర్గాల్లో గంజాయి విక్రయాలతో పాటు జూదం విచ్చలవిడిగా సాగుతున్నా ఎస్పీ నోరు మెదపరు. గత ప్రభుత్వ హయాంలో ఖాకీ యూనిఫాంను నమ్ముకుని పనిచేసిన పోలీసులు ఇప్పుడు ఎమ్మెల్యేల దయాదాక్షిణ్యాల మీద పని చేయాల్సి వస్తోంది.

అరాచకాలను తిప్పికొడతాం

- 8న రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి జగన్ రాక
- మాజీ ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం కార్పొరేషన్: 'స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ లేదని తెలిసినా రాప్తాడు, కదిరి ప్రాంతాల్లో అధికార పార్టీ నేతలు దౌర్జన్యానికి పాల్పడ్డారు. తమకు మెజారిటీ లేదని, ఎంపీపీ అభ్యర్థి లేరని స్వయంగా చెప్పిన ఎమ్మెల్యే పరిటాల సునీత రామగిరిలో అరాచకం సృష్టించారు. టీడీపీ అరాచకాలను ప్రజాస్వామ్య పద్ధతిలోనే తిప్పికొడతాం' అని వైఎస్సార్ సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బెదిరింపులు, దాడులు, దౌర్జన్యాలకు పాల్పడినా ఉప ఎన్నికల్లో సత్తా చాటామన్నారు. టీడీపీ నాయకుల చేతిలో హత్యకు గురైన రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురుబ లింగమయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈ నెల 8న వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాపిరెడ్డి పల్లికి రానున్నారని, ప్రతి కార్యకర్త, నాయకులు, నేతలకు జగన్ అండగా ఉంటారన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసు శాఖ విఫలమైందని 'అనంత' విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థులను తరలించేందుకు పోలీసులు సహకరించారంటే ఇంతకన్నా దారుణమైన పరిస్థితి ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు.

న్యూస్‌రీల్

హంద్రీ-నీవా లైనింగ్ పనుల అడ్డగింత



తనకల్లు మండలం సీఆర్ పల్లి వద్ద పనులను అడ్డుకున్న రైతు సంఘం నాయకులు

తనకల్లు/నల్లచెరువు: భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం చూపే హంద్రీ-నీవా కాలువకు వేస్తున్న సిమెంట్ లైనింగ్ వెంటనే నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం తనకల్లు మండలం సీఆర్ పల్లి సమీపంలో, నల్లచెరువు మండలం కొల్లిపల్లి వద్ద హంద్రీనీవా కాలువలో చేస్తున్న లైనింగ్ పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు హరి, కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న మాట్లాడుతూ... హంద్రీ-నీవా కాలువకు లైనింగ్ చేయడం ద్వారా రైతులకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. సిమెంట్ లైనింగ్‌తో భూమిలో నీరు ఇంకదన్నారు. అందువల్ల కాలువను వెడల్పు చేసి జలాలు భూమిలో ఇంకేలా చేయాలన్నారు. దీని వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. వెంటనే హంద్రీ-నీవా కాలువ లైనింగ్ పనులను ఆపివేయాలని డిమాండ్ చేశారు. హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణా జలాలతో ప్రతి చెరువునూ నీటితో నింపాలని కోరారు. లైనింగ్ పనులు ఆపేంత వరకూ అక్కడి నుంచి వెళ్లేది లేదంటూ బైఠాయించారు. త్వరలోనే రైతులందరితో కలసి పెద్ద ఎత్తున ఆందోళన చేయనున్నట్లు తెలియజేశారు. ఆయా మండలాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఏపీ రైతు సంఘం నాయకులు శివన్న, రమణ, సీఐటీయు ఒంటిద్దు వేమన్న, నాయకులు శ్రీరాములు, నాగిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, నాగేంద్ర, రైతులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్ వద్ద ఉద్రిక్తత

సోమందేపల్లి: స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద బుధవారం సాయంత్రం ఉద్రిక్తత చోటు చేసుకుంది. నాలుగు రోజుల క్రితం నవీన్ అనే యువకుడిపై ముగ్గురు యువకులు దాడి చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి బుధవారం మండల తహసీల్దార్ ఎదుట నిందితులను బైండోవర్ చేశారు. అయితే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ తొగట వీరక్షత్రియ కులస్తులు దాదాపు 200 మంది పీఎస్ వద్దకు చేరుకున్నారు. అయితే కేసుకు సంబంధం లేని వ్యక్తులు గుమిగూడవద్దని ఎస్‌ఐ రమేష్‌బాబు సూచించడంతో వారు అసహనానికి గురై, వాగ్వాదానికి దిగారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సీఐ రాఘవన్ అక్కడకు చేరుకుని నచ్చజెప్పారు. దీంతో వివాదం సద్దుమణిగింది. కాగా, ఈ ఘటనను కవరేజ్ చేసేందుకు వెళ్లిన తన సెల్‌ఫోన్‌ను అనిల్ అనే యువకుడు లాక్కొని ధ్వంసం చేశాడంటూ పోలీసులకు పాత్రికేయుడు శ్రీనివాసులు ఫిర్యాదు చేశాడు.

నీటి కోసం నిరసనాగ్రహం



రొళ్ల మండలం అగ్రహారంలో ఖాళీ బిందెలను రోడ్డుపై ఉంచి నిరసన తెలుపుతున్న మహిళలు

రొళ్ల: తాగునీటి సమస్య తీర్చాలంటూ మండలంలోని అగ్రహారం గ్రామానికి చెందిన మహిళలు బుధవారం నిరసనకు దిగారు. రొళ్ల-గుడిబండ ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలు ఉంచి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తాగునీరు సరఫరా చేసే బోరులో నీళ్లు సమృద్ధిగా ఉన్నాయని, అయితే ఓ రైతు తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్‌కు ద్వారా తన పొలానికి నీరు పారించుకుంటుండంతో సమస్య తలెత్తుతోందన్నారు. ఈ విషయాన్ని అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని వాపోయారు. మహిళల నిరసనతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ సదాశివప్ప, ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ బాబురావు, కార్యదర్శి శ్రీనాథ్ అక్కడికి చేరుకుని మహిళలతో మాట్లాడారు. తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆ వెంటనే వాటర్‌స్కీమ్ పైప్‌లైన్‌కు రైతు వేసుకున్న అక్రమ కనెక్షన్ తొలగించారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

భూసేకరణతో మా పొట్టకొట్టొద్దు

- కలెక్టర్‌ను వేడుకున్న రెండు గ్రామాల రైతులు
- ఇప్పటికే ఏపీఐఐసీకి భూములిచ్చి అన్యాయమయ్యామని ఆవేదన



భూ సేకరణ చేయవద్దని జిల్లా కలెక్టర్, ఏపీఐఐసీ చైర్మన్‌కు వినతిపత్రాలు అందజేసిన రైతులు

మడకశిర రూరల్: ''పరిశ్రమలు కావాల్సిందే. అందుకోసం మా భూములు సేకరించి మా పొట్టకొట్టొద్దు...ఇప్పటికే తొలివిడత భూసేకరణలో భూములు కోల్పోయాం. ఇప్పుడున్న ఉన్న కొద్దిపాటి భూములనూ సేకరిస్తే మా కుటుంబాలు రోడ్డున పడతాయి. దయచేసి మా భూములు సేకరించకండి'' అంటూ గౌడనహళ్లి పంచాయతీలోని జమ్మానిపల్లి, తురుకువాండ్లపల్లి, గౌడనహళ్లి గ్రామాల రైతులు కలెక్టర్ చేతన్‌ను వేడుకున్నారు. బుధవారం కలెక్టర్ చేతన్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సునైనా సోని తదితరులు ఆర్.అనంతపురం వద్ద పరిశ్రమల ఏర్పాటుకు ఇప్పటికే ఏపీఐఐసీ సేకరించిన భూములను పరిశీలించారు. సెజ్ భూముల్లోని మట్టిని కొందరు అక్రమంగా తవ్వుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. అవసరమైతే సెక్యూరిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం ఏపీఐఐసీ ద్వారా సేకరించిన, సేకరించనున్న భూములకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలించారు.

అన్యాయం చేయొద్దు సార్..

పరిశ్రమల ఏర్పాటు కోసం ఏపీఐఐసీకి ఇప్పటికే భూములిచ్చామని, రెండో విడతలోనూ తమ గ్రామంలోనే భూసేకరించి తమను అన్యాయం చేయవద్దని జమ్మానిపల్లి, తురుకువాండ్లపల్లి, గౌడనహళ్లి గ్రామాల రైతులు కలెక్టర్ చేతన్, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజులకు వేడుకున్నారు. ఈ మేరకు వినతి పత్రాలు సమర్పించారు. భూసేకరణ నిలిపివేయాలని ఇప్పటికే డీఆర్‌ఓ, ఆర్డీఓ, తహసీల్దార్లకు వినతి పత్రాలు అందించామని రైతులు గుర్తు చేశారు. అయితే వర్షాలు కురవక బీడుగా మారిన భూముల వల్ల రైతులకు నష్టం కలుగుతున్నట్లు గుర్తించి... సోలార్ పార్కు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. దీనివల్ల రైతులకు ఎకరాకు రూ.30 వేల ఆదాయం వస్తుందని ఏపీఐఐసీ చైర్మన్ వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఆనంద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నేత్రపర్వం.. స్నపన తిరుమంజనం



ఖాద్రీశునికి అభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీశుని స్నపన తిరుమంజనం బుధవారం నేత్రపర్వంగా సాగింది. వసంత రుతువు చైత్ర మాసం శుద్ధ పంచమి కృత్తికా నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభుడికి అర్చకులు వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయంలో శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం సేవను అత్యంత వైభవంగా చేశారు. ఉత్సవంలో భాగంగా స్వామివారికి పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు, కొబ్బరి నీళ్లతో పాటు సుగంధ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. ఆస్థాన పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీవారికి నిర్వహించే ఈ ఉత్సవాన్ని స్థానికంగా 16 రోజుల పండుగ అని పిలుస్తారని అర్చకులు తెలిపారు. అనంతరం భక్తులు స్వామివారి దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



హాజరైన భక్తులు

కూటమి మోసంపై టీచర్ల కన్నెర్ర

- డిమాండ్ల సాధనకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టర్ ఎదుట ధర్నా
- సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక



కలెక్టరేట్ ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రశాంతి నిలయం: గద్దెనెక్కి 9 నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్య పరిష్కారానికి చొరవ చూపని కూటమి సర్కార్‌పై ఉపాధ్యాయ లోకం కన్నెర్ర చేసింది. డిమాండ్ల సాధన కోసం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇచ్చిన మాట నిలుపుకోవాలంటూ నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలన్నీ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫ్యాప్టో జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఉపాధ్యాయులకు ఎన్నో హామీలిచ్చారన్నారు. కానీ ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు దాటుతున్నా ఇంతవరకూ ఒక్కటీ నెరవేర్చలేదని మండిపడ్డారు. 11వ పీఆర్సీ కమిషన్ కాలపరిమితి ముగిసి 21 నెలలైనా 12వ వేతన సవరణ కమిటీ మీద నూతన ప్రభుత్వం దృష్టి సారించకపోవడం అన్యాయమన్నారు. వెంటనే 30 శాతం మధ్యంతర భృతి కల్పించే విధంగా వేతన సవరణ సంఘం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

పాతపెన్షన్ అమలు చేయాలి

ఉద్యోగులకు పాత పెన్షన్ అమలు చేయాలని కేంద్రం జీఓ 57 జారీ చేసిందని, దీని ఆధారంగా దేశంలో పలు రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానం అమలవుతోందన్నారు. మన రాష్ట్రంలోనూ వెంటనే సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పంచాయతీ రాజ్ యాజమాన్యంలో వెంటనే కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. స్థానిక సంస్థల్లో పనిచేస్తూ కోవిడ్ సమయంలో మృతి చెందిన ఉపాధ్యాయ, ఉద్యోగ వారసులకు కలెక్టర్ పూల్ ద్వారా నియామకాలు చేపట్టాలన్నారు. 2003 డీఎస్సీ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఎంటీఎస్ ఉపాధ్యాయులకు సంవత్సరంలో 12 నెలలూ పూర్తి వేతనం ఇవ్వాలన్నారు



జేసీ అభిషేక్ కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

బకాయిలు చెల్లించాలి

11వ పీఆర్సీ, డీఏ, సంపాదిత సెలవుల బకాయిలు, సీపీఎస్ ఉద్యోగుల బకాయిలన్నీ కలిపి దాదాపు రూ.30 వేల కోట్లు ఉన్నాయన్నారు. కానీ ప్రభుత్వం ఇప్పటికి రెండు విడతలుగా కేవలం రూ.7,300 కోట్లు మాత్రమే విడుదల చేసిందని, మిగతా రూ.23 వేల కోట్ల బకాయిలు చెల్లింపులకు కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ 72, 73, 74 ప్రకారం ఉపాధ్యాయులకు ఎంఈఓలు, డిప్యూటీ డీఓలు, డైట్ లెక్చరర్లగా పదోన్నతి కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు తెలుగు మీడియం కొనసాగించాలని కోరారు. ఉద్యమాల కారణంగా గతంలో ఉపాధ్యాయులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని సమస్యలు పరిష్కరించకపోతే భవిష్యత్తులో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను ఆయన చాంబర్‌లో కలసి డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. అంతకుముందు ఉపాధ్యాయులు ఎనుములపల్లి గణేష్ సర్కిల్ నుంచి కలెక్టరేట్ వరకు ఫ్యాప్టో ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్యాప్టో కోశాధికారి భాస్కర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ షమీవుల్లా, డిప్యూటీ సెక్రెటరీ జనరల్స్ హరిప్రసాద్‌రెడ్డి, సుధాకర్, ఎస్టీయూ నేత చంద్రశేఖర్, యూటీఎఫ్ నేత జయచంద్రారెడ్డి, ఏపీటీఎఫ్257 నేత శ్రీనివాసులు, ఏపీటీఎఫ్1938 నేత విశ్వనాథరెడ్డి, డీటీఎఫ్ నేత మారుతి ప్రసాద్, పీడీ అసోసియేషన్ సభ్యుడు రామకృష్ణ, ఎస్ఎస్ఏ ఓబుల్‌రెడ్డి, వెంకటనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

- కలెక్టర్ టీఎస్ చేతన్
- హెచ్‌ఎం పల్లిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగుచేసిన పంటల పరిశీలన



రొళ్ల మండలం హెచ్‌ఎం పల్లిలో సాగు చేసిన అంతర పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ చేతన్

రొళ్ల: ప్రకృతి వ్యవసాయం రైతుకు లాభదాయకంగా ఉంటుందని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వల్ల పెట్టుబడులు తగ్గడంతో పాటు రసాయనాలు లేని పంటలు ప్రజలకు అందించవచ్చన్నారు. బుధవారం ఆయన హెచ్‌ఎం పల్లిలో పర్యటించారు. ఈ సందర్భంగా మహిళ రైతు లక్ష్మమ్మ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న బొప్పాయి, వక్కతోటలో అంతర పంటగా సాగు చేసిన ఆకుకూరలు, ముల్లంగి, క్యారెట్, బీట్ రూట్, ఉల్లి, కాకర, బెండ, వంగ, టమాట తదితర పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో కూరగాయలు, ఆకుకూరలతో పాటు ఇతర ఉద్యానపంటలు సాగుచేయడం వల్ల నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఆదాయం పొందుతున్నానని ఈ సందర్భంగా లక్ష్మమ్మ కలెక్టర్ చేతన్‌కు వివరించారు. ప్రకృతి వ్యవసాయం వల్ల సీజన్‌తో సంబంధం లేకుండా ఏడాది పొడవునా పంటలు పండిస్తూ అత్యధిక లాభాలు అర్జిస్తున్నానని వెల్లడించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ న్యాచురల్ ఫార్మింగ్ (ఏపీ సీఎన్‌ఎఫ్) ప్రాజెక్ట్ ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలు అద్భుతమైన సత్ఫలితాలిస్తున్నాయన్నారు. మిగతా రైతులు కూడా లక్ష్మమ్మను ఆదర్శంగా తీసుకుని ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో కీలక పాత్ర పోషించే ఘన, ద్రవ జీవామృతం తయారీ విధానాన్ని కలెక్టర్ చేతన్ అడిగి తెలుసుకున్నారు. ఎకరా పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలసాగుకు రైతులు చేస్తున్న ఖర్చు, దిగుబడి, ఆదాయం తదితర అంశాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట పెనుకొండ ఆర్డీఓ ఆనంద్‌కుమార్, డీఏఓ సుబ్బారావు, ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్ట్ మేనేజర్ లక్ష్మ నాయక్, ఏడీఏ కృష్ణమీనన్, ప్రోగ్రాం మేనేజర్ నరేంద్రకుమార్, తహసీల్దార్ షేక్షావలి, ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త డా. నవీన్, డివిజన్ ఎంటీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ..

అగళి: మండలంలోని హెచ్‌డీ హళ్లి పంచాయతీలోని గాయత్రి కాలనీ పరిసర ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుకు తగిన స్థలాన్ని పరిశీలించేందుకు బుధవారం వచ్చిన కలెక్టర్ చేతన్... స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలోని వివిధ రికార్డులను పరిశీలించారు. పరిశ్రమకు ఏర్పాటుకు కావాల్సినంత భూమి అందుబాటులో ఉందా... ఆ భూమి పరిశ్రమల ఏర్పాటుకు పనికి వస్తుందా అని ఆరా తీశారు. పూర్తి వివరాలతో నివేదిక పంపాలని తహసీల్దార్ సుబ్బారావును ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు.. సువర్ణముఖీ నది నుంచి ఇసుకను తవ్వుకుని కర్ణాటక ప్రాంతానికి అక్రమంగా తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ వెంట ఆర్ఐ చంద్రశేఖర్ రావు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అరటి తోట దగ్ధం



కాలిపోయిన అరటి చెట్లు

తలుపుల: మండలంలోని గెరికపల్లి గ్రామానికి చెందిన రైతు చెన్నకృష్ణారెడ్డి సాగు చేసిన అరటి తోట మంటల్లో కాలిపోయింది. తోట మీదుగా ఉన్న 11కేవీ విద్యుత్ తీగలు మంగళవారం ఎండ ప్రభావానికి వేడెక్కి రాత్రి తెగి పడ్డాయి. దీంతో తీగలు ఒకదానితో ఒకటి తగిలి నిప్పురవ్వలు ఎగిసి పడి మంటలు వ్యాపించాయి. రైతు అప్రమత్తమై మంటలు ఆర్పేలోపు దాదాపు 70 అరటి చెట్లు కాలి బూడిదయ్యాయి. ఘటనతో రూ.లక్ష మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

గుంతకల్లు: స్థానిక మద్దికెర రైలు మార్గంలోని పట్టాల పక్కన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని బుధవారం ఉదయం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర అక్కడకు చేరుకుని పరిశీలించారు. రన్నింగ్ రైలు నుంచి ప్రమాదవశాత్తు కిందకు పడి మృతి చెందినట్లుగా ధ్రువీకరించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామన్నారు. మృతుడికి దాదాపు 30 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, ఛామని చాయ రంగు, తెల్లరంగు నీలం పూల చొక్కా, బ్లూ జీన్స్ ప్యాంట్ ధరించాడని వివరించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 98661 44416కు సమాచారం అందించాలని కోరారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి ఆత్మహత్య

- ఒంటరి జీవితం భరించలేక ఒకరు
- తాగుడుకు డబ్బివ్వలేదని మరొకరు

పరిగి: మండలంలోని వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం ఇద్దరు వ్యక్తులు ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన మేరకు... ఊటుకూరు గ్రామ ఎస్సీ కులానికి చెందిన సుంకప్ప భార్య చౌడమ్మ(74)కు కుమారుడితో పాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. భర్త మృతి చెందిన అనంతరం చిన్న కుమార్తె జయమ్మతో కలసి ఉంటోంది. కుమార్తెకు భారం కాకూడదని నిర్ణయించుకున్న ఆమె గతంలో పలుమార్లు ఆత్మహత్యాయత్నం చేసింది. సకాలంలో కుటుంబసభ్యులు గుర్తించడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ క్రమంలో బుధవారం ఉదయం గ్రామ శివారులోని శ్మశాన వాటికకు చేరుకున్న ఆమె చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

- మండలంలోని మోదా పంచాయతీ పరిధి కోనాపురంలో రామాంజినప్ప కుమారుడు హరిజన బాబు(26) ఆత్మహత్య చేసుకున్నాడు. బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న బాబుకు పెళ్లి కాలేదు. మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలంటూ తరచూ తల్లి తిప్పక్కతో గొడవపడేవాడు. మంగళవారం తల్లి పింఛన్ నగదు తీసుకున్న విషయం తెలుసుకుని మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వాలని గొడవ పడ్డాడు. ఆమె ఇవ్వకపోవడంతో అదే రోజు రాత్రి ఇంట్లో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇళ్ల స్థలాలకు చుక్కల గ్రహణం

- రిజిస్ట్రేషన్ కాక ఇబ్బందులు
- రెవెన్యూ రికార్డులు కాలిపోవడంతో ప్రజలకు తీరని కష్టాలు



ముదిగుబ్బ ముఖ చిత్రం

ముదిగుబ్బ: మండల కేంద్రంలో ఇంటి స్థలాలు కొనుగోలు చేసినా.. విక్రయించినా... రిజిస్ట్రేషన్ కాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముదిగుబ్బలో మొత్తం 40 సర్వే నెంబర్లలో 350 ఎకరాల విస్తీర్ణంలో ఇళ్ల నిర్మాణాలు జరిగాయి. అయితే నాలుగు సర్వే నెంబర్లు మాత్రమే రిజిస్ట్రేషన్ అవుతున్నాయి. మిగిలిన 36 సర్వే నెంబర్లు చుక్కల భూములు, అనెగ్జర్ 2, 3, 4, 5 (వాగులు, వంకలు, కొండలు, దేవదాయ, వక్ఫ్, సర్ప్లస్, కోర్టు వివాదాలు) లో ఉండడం కారణంగా 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు. దీంతో ఆయా సర్వేనెంబర్లు రిజిస్ట్రేషన్ కాక నిలిచిపోయాయి.

2018 తర్వాత బంద్..

ముదిగుబ్బలో 5,400 ఇళ్ల నిర్మాణం చేయగా, ఇందులో 25వేల మంది జనాభా ఉన్నారు. ఇండ్ల మధ్యన కొన్ని స్థలాలు కూడా వున్నాయి. మండల కేంద్రంలో ఇళ్ల స్థలాలను కొనుగోలు చేసి పెట్టుకుంటే భవిష్యత్‌లో ధరలు పెరిగినప్పుడు లాభదాయకంగా ఉంటుందని గ్రామీణ ప్రాంత ప్రజలు కొన్ని స్థలాలు కొనుగోలు చేశారు. వీటికి సంబంధించి 2018కి ముందు రిజిస్ట్రేషన్లు అయ్యేవి. 2018 తర్వాత నుంచి వాటి రిజిస్ట్రేషన్లు కావడం లేదు. ప్రస్తుతం వారి ఇంట శుభకార్యాలయాలకు, పిల్లల చదువులకు, ఇతర ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడేందుకు బ్యాంక్‌ల్లో తాకట్టు పెట్టుందుకు సిద్ధం కాగా, రిజిస్ట్రేషన్‌లు కాకపోవడంతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయారు.

రెవెన్యూ రికార్డులు కాలిపోయి..

పరిటాల రవీంద్ర హత్యానంతరం ముదిగుబ్బలో జరిగిన అల్లర్ల కారణంగా మండల రెవెన్యూ కార్యాలయంలోని రికార్డులు కాలిపోయాయి. అప్పటి నుంచి ప్రతి చిన్న విషయానికి ఉన్నతాధికారులు కార్యాలయాల రికార్డులు చూపించాలని ఆదేశిస్తున్నారు. దీంతో రికార్డులు కాలిపోవడంతో వాటికి సంబంధించిన ఆధారాలను మండల రెవెన్యూ అధికారులు చూపలేకపోతున్నారు. దీంతో ఎన్‌ఓసీ కోసం పెట్టుకున్న ఫైళ్లను సైతం పక్కకు పెడుతున్నారు. ఫలితంగా స్థిరాస్తులకు సంబంధించిన పనులు జరగక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కలుగజేసుకుని ప్రత్యామ్నాయం చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో మంచి అవకాశం..

అనెగ్జర్ 1, 2, 5 భూములను 22ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. భూములకు సంబంధించిన పత్రాలను ఆధారాలను జత పరిచి రైతులు, ఇళ్ల స్థలాల యజమానులు తమ భూములు రిజిస్ట్రేషన్ అయ్యేలా ఎన్‌ఓసీ కోసం అప్పట్లో ఇచ్చారు. అలాగే 20 సంవత్సరాల క్రితం పట్టా పొందిన రైతులకు సైతం తమ భూములను (ఫ్రీ ఓల్డ్) రిజిస్ట్రేషన్ అయ్యేలా గత ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ ప్రక్రియను అటకెక్కించింది.

అమ్ముకోలేకపోతున్నాం



నాకు పెద్దల నుంచి సంక్రమించిన ఇళ్ల స్థలాలు ఉన్నాయి. అయినా వాటిని అమ్ముకోలేకపోతున్నాం. స్థలాలు అమ్ముకుని ఏదైనా వ్యాపారం చేయాలనుకుంటే ఆ స్థలాలు రిజిస్ట్రేషన్ కాకపోవడంతో కొనేవారు ముందుకు రావడం లేదు. ఉన్నతాధికారులు ఈ సమస్యను పరిష్కరించాలి. – మీసేవ చంద్ర, ముదిగుబ్బ

ప్రత్యామ్నాయం చూపాలి



ముదిగుబ్బలో ఇళ్ల స్థలాలు, ఇళ్ల క్రయవిక్రయాలు నిలిచిపోయి చాలా మంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ అప్రూవల్ కావాలన్నా...రిజిష్టర్ పత్రాలను జత పరచాలి. చాలా మంది వద్ద రిజిష్టర్ పత్రాలు లేక అప్రూవల్ చేసుకోలేక పోతున్నారు. పంచాయతీకి ఆదాయం తగ్గిపోయింది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గం చూపాలి. – చంద్రాయుడు, ముదిగుబ్బ

పట్టా భూములు మాత్రమే రిజిస్టర్ అవుతాయి



చుక్కల భూములు, అసైన్డ్ భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చారు. అలాంటి భూములు రిజిస్ట్రేషన్ కావు. ముదిగుబ్బలో చాలా వరకు ప్రభుత్వం ఇచ్చిన డీ పట్టా భూములే ఎక్కువగా ఉన్నాయి కాబట్టి రిజిస్ట్రేషన్‌లు కావడం లేదు. పాత పట్టా భూములు మాత్రమే రిజిస్ట్రేషన్ అవుతాయి.

– నారాయణస్వామి, తహసీల్దార్

రోప్ స్కిప్పింగ్‌లో అపురూపం

జాతీయ స్థాయి రోప్‌లో రాణించిన గురుకుల విద్యార్థిని



రూపను అభినందిస్తున్న గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు



నాసిక్‌లో సాధించిన వెండి పతకాన్ని చూపుతున్న రూపతో పీడీ రోజా (ఫైల్)

అమరాపురం: గ్రామీణ రైతు కుటుంబంలో జన్మించిన రూప.. చదువులోనే కాదు క్రీడల్లోనూ తనకు సాటి లేరని నిరూపిస్తోంది. సరైన ప్రోత్సాహం, అవకాశాలను అందిపుచ్చుకుని జాతీయ స్థాయిలో తన క్రీడా నైపుణ్యాన్ని చాటి పతకాన్ని సొంతం చేసుకుంది. వివరాలు.. అనంతపురం జిల్లా బెళుగుప్ప మండలం నక్కలపల్లి గ్రామానికి చెందిన వెన్నపూస సుజాత, వెంకట్రామిరెడ్డి దంపతుల కుమార్తె రూప ప్రస్తుతం అమరాపురం మండలం హాలుకూరు సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. చదువుతో పాటు పాఠశాల స్థాయిలో నిర్వహిస్తున్న ప్రతి క్రీడాపోటీల్లోనూ ఆమె ప్రతిభ చాటడం గమనించిన పీడీ రోజా... విషయాన్ని వెంటనే ప్రిన్సిపాల్ పద్మావతి దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా ఆమెలోని క్రీడానైపుణ్యాలను వెలికి తీస్తే పాఠశాలకు మంచి పేరు వస్తుందని భావించిన ప్రిన్సిపాల్ వెంటనే ఆ దిశగా రూప ను ప్రోత్సహిస్తూ వచ్చారు. దీంతో రోప్ స్కిప్పింగ్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన రూప... ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో తొలిసారిగా పాల్గొని వరుసగా బంగారు పతకాలను కైవసం చేసుకుంది. ఫిబ్రవరిలో మహారాష్ట్రలోని నాసిక్ వేదికగా జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్ని ప్రతిభ చాటి వెండి పతకాన్ని సాధించింది. జాతీయ స్థాయి క్రీడల్లో రాణించి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చిన రూపను పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది, ఎస్ఐ ఇషాక్‌బాషా, ఎంఈఓ, గ్రామస్తులు అభినందించి, భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

96.7 శాతంతో సరి

- లక్ష్యానికి చేరువగా వచ్చి ఆగిపోయిన మార్కెటింగ్‌శాఖ



టార్గెట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

అనంతపురం అగ్రికల్చర్: నిర్దేశిత లక్ష్యానికి చేరువగా మార్కెటింగ్‌శాఖ వచ్చి ఆగిపోయింది. మార్చి నెలాఖరుతో ముగిసిన 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్ పోస్టుల ద్వారా రూ.12.06 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా... 96.7 శాతంతో రూ.11.66 కోట్లు సాధించినట్లు ఆ శాఖ ఏడీ పి.సత్యనారాయణచౌదరి బుధవారం వెల్లడించారు. ఇందులో రాయదుర్గం మార్కెట్‌యార్డు రూ.1.44 కోట్లకు గానూ 112 శాతంతో రూ.1.61 కోట్లకు పైగా సాధించి మొదటి స్థానంలో నిలిచింది. కళ్యాణదుర్గం 105 శాతం, శింగనమల, తాడిపత్రి 103 శాతం, గుంతకల్లు 102 శాతం సాధించి లక్ష్యాన్ని చేరుకున్నాయి. ఇక అనంతపురం మార్కెట్‌యార్డు లక్ష్యం రూ.4.60 కోట్లు కాగా, 94 శాతంతో రూ.4.27 కోట్లకు పైగా వసూలు చేసి లక్ష్యానికి చేరువగా నిలిచిపోయింది. మిగిలిన వాటిలో ఉరవకొండ 84 శాతం, గుత్తి 90 శాతం కాగా ఆఖరి స్థానంలో రాప్తాడు మార్కెట్ కమిటీ 44 శాతంతో లక్ష్యానికి ఆమడదూరంలో ఆగిపోయింది. ఈ క్రమంలో ఏప్రిల్ నుంచి ప్రారంభమైన ప్రస్తుత 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లా మార్కెటింగ్‌శాఖకు రూ.13.93 కోట్లు లక్ష్య నిర్దేశన చేసినట్లు ఏడీఎం తెలిపారు. ఇందులో అత్యధికంగా అనంతపురం మార్కెట్ కమిటీకి రూ.5.25 కోట్లు టార్గెట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

శ్రీసత్యసాయి జిల్లాలో 98.2 శాతం..

శ్రీసత్యసాయి జిల్లా పరిధిలోని 8 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టులకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5.31 కోట్లు లక్ష్యం ఇవ్వగా రూ.5.22 కోట్లు వరకు వసూలు చేసి 98.2 శాతం ప్రగతి సాధించినట్లు ఏడీఎం ఎల్ఎన్ మూర్తి తెలిపారు. ఇందులో పెనుకొండ మార్కెట్‌యార్డు 162 శాతంతో మొదటి స్థానంలో ఉండగా... తనకల్లు 132 శాతం, కదిరి 106 శాతం, గోరంట్ల 102 శాతం, పుట్టపర్తి 100 శాతం వసూళ్లతో లక్ష్యాన్ని చేరుకున్నాయి. హిందూపురం 93 శాతం, మడకశిర 91 శాతం, ధర్మవరం మార్కెట్‌యార్డు 76 శాతం వసూళ్లతో లక్ష్య సాధనలో వెనుకబడ్డాయి. కాగా, ఏప్రిల్ నుంచి మొదలైన 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను శ్రీసత్యసాయి జిల్లా మార్కెటింగ్‌శాఖకు రూ.5.86 కోట్ల వసూళ్ల లక్ష్యంగా నిర్దేశించినట్లు ఏడీఎం తెలిపారు.

ఆత్మకూరు హెచ్‌ఎం సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్..

అనంతపురం ఎడ్యుకేషన్: ఆత్మకూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. గత నెల 29న ఆత్మకూరు పరీక్ష కేంద్రంలో కేజీబీవీ విద్యార్థిని అప్పటికే తనకు తెలిసిన ప్రశ్నలన్నింటికీ జవాబులు రాసి కూర్చుంది. ఆ సమయంలో ప్రశ్నపత్రం కిందకు పడిపోయి గాలికి వెనుక వైపు బెంచీవద్దకు వెళ్లింది. అదే సమయంలో చీఫ్ సూపరింటెండెంట్ శ్రీనివాసప్రసాద్ ఆ గదిలో చేరుకుని పరిశీలిస్తున్న క్రమంలో ఆ విద్యార్థిని వద్దకు వెళ్లాడు. ఆన్సర్ షీటు మాత్రం కనిపించడంతో ప్రశ్నపత్రం ఎక్కడ? అని అడిగాడు. హఠాత్పరిణామంతో ఆ విద్యార్థిని తీవ్ర కంగారుకు గురైంది. ఇక్కడే ఉందంటూ ఆందోళన చెంది వెతుకుతుండగా ఒక్కసారిగా కర్రతో ఆ విద్యార్థినిని చితకబాదాడు. దాడిలో భుజపుటెముక విరిగింది. దీంతో తర్వాత రోజు పరీక్ష రాయలేని పరిస్థితి. ఈ పరిణామంపై 'సాక్షి'లో 'శ్రీనివాసా...ఇదెక్కడి 'కర్ర' పెత్తనం శీర్షికతో కథనం వెలువడింది. దీనిపై విద్యాశాఖ అధికారులు తీవ్రంగా స్పందించారు. స్వయంగా పాఠశాల విద్య కమిషనర్ విజయరామరాజు ఈ ఘటనపై ఆరా తీశారు. విద్యార్థినిది ఏమాత్రం తప్పు లేదని హెచ్‌ఎం ఓవర్‌గా రియాక్ట్ అయ్యాడంటూ జిల్లా అధికారులు వివరించడంతో సదరు హెచ్‌ఎంపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ క్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసప్రసాద్‌ను సస్పెండ్ చేస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీ చేశారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కదిరి టౌన్: తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. కదిరి పీఎస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుడి వివరాలను డీఎస్పీ శివనారాయణస్వామి వెల్లడించారు. కదిరిలోని హిందూపురం క్రాస్ రోడ్డులో నివాసముంటున్న బాబాఫకృద్దీన్ గత నెల ఇంటికి తాళం వేసి కుటుంబసభ్యులతో కలసి షాపింగ్‌కు వెళ్లారు. విషయాన్ని గమనించిన దుండగుడు అదే రోజు అర్ధరాత్రి ఇంటి వెనుక తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలోని రూ.9.70 లక్షల నగదు, రెండు తులాల బంగారం చైన్ అపహరించాడు. ఘటనకు సంబంధించి బాధితుడి ఫిర్యాదు మేరకు గత నెల 17న కేసు నమోదు చేసిన పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లినప్పుడు అలాంఖాన్ వీధికి చెందిన పఠాన్ షాబీర్ ఇంటి మిద్దెపై నుంచి దూకినట్లుగా ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో షాబీర్‌పై అనుమానం వచ్చి సీఐ వి.నారాయణ రెడ్డి,ఎస్ఐ బాబ్జాన్ రెండు బృందాలుగా విడిపోయి గాలింపు చేపట్టారు. విషయం తెలుసుకున్న పఠాన్ షాబీర్ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి షాబీర్ కోసం గాలిస్తుండగా బుధవారం ఉదయం కదిరి మండలం సున్నపుగుట్ట తండా కొత్త బైపాస్ వద్ద తచ్చాడుతుండగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో బాబాఫకృద్దీన్ ఇంట్లో చోరీ చేసినట్లుగా అంగీకరించడంతో రూ.9.70 లక్షల నగదు, 2 తులాల బంగారం నగను స్వాధీనం చేసుకుని, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

కదిరి టౌన్: పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై కత్తితో దాడి చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. వివరాలను బుధవారం ఆయన వెల్లడించారు. కదిరిలోని వాణి వీధిలో నివాసముంటున్న షేక్ సమీవుల్లా, వలీసాహెబ్ రోడ్డుకు చెందిన దాదాపీర్ కలసి ఉమ్మడి వ్యాపారం చేసుకునే వారు. మంగళవారం రాత్రి సమీవుల్లాపై దాదాపీర్ కత్తితో దాడి చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బుధవారం ఉదయం దాదాపీర్‌ను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు.

దౌర్జన్యాలు సహించం

- తిట్టినందుకే దుర్మార్గుడినైతే వందలాది మందిని పొట్టనబెట్టుకున్న పరిటాల రవి దేవుడా?
- మారణకాండను ఆపేందుకు అవసరమైతే ప్రాణత్యాగానికి కూడా సిద్ధం
- 8న రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి వైఎస్ జగన్ రాక
- వైఎస్సార్‌సీపీ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న తోపుదుర్తి చందు

అనంతపురం ఎడ్యుకేషన్: దౌర్జన్యాలతో పబ్బం గడుపుకోవాలని చూస్తే సహించబోమని ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారులు, సోదరులు, బంధువులను వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాప్తాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యే, వారి బంధువుల దౌర్జన్యాలు పెచ్చుమీరాయని మండిపడ్డారు. జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరిటాల సునీత బంధువుల చేతిలో హత్యకు గురైన రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన కురుబ లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించేందుకు ఈ నెల 8న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రానున్నారన్నారు. ప్రజాస్వామ్యవాదులు, శాంతికాముకులు, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పోలీసులకు విస్తృత స్వేచ్ఛ ఉండేదన్నారు. ఏ చిన్నదాడి జరిగినా మన.. తమ అనే భేదభావాలు లేకుండా కేసులు నమోదు చేశారని గుర్తు చేశారు. దీంతో రాప్తాడు నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే పరిటాల సునీత, ఆమె కుమారులు, సోదరులు, బంధువులు హత్యారాజకీయాలకు పాల్పడుతున్నారని, ఫలితంగా నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణం మటుమాయమైందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో తాను చంద్రబాబును ఉద్దేశించి మాట్లాడిన మాటలను తరచూ గుర్తు చేస్తున్నారని, అయితే తనను రెచ్చగొట్టేలా చంద్రబాబు వ్యాఖ్యలు చేయడంతోనే తాను ఆయనపై విమర్శలు చేయాల్సి వచ్చిందన్నారు. 'చంద్రబాబు, లోకేష్... మీకు బాధ కలిగి ఉంటే క్షమించాలని ఆ రోజే చెప్పా...ఈ రోజు కూడా క్షమించమని చెబుతున్నా. తిట్టినందుకే నేను దుర్మార్గుడిని అయితే వందలాది మందిని హతమార్చిన నీ భర్త (పరిటాల రవి) దేవుడా?... చెప్పు సునీతమ్మా' అంటూ ప్రశ్నించారు. పరిటాల వర్గీయులు సాగిస్తున్న దుర్మార్గాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిస్తున్న పోరాటంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలుగా తాము సమిధలయ్యేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో అనంతపురం రూరల్, రాప్తాడు ఎంపీపీలు వరలక్ష్మి, జయలక్ష్మి,, వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందరెడ్డి, బండి పవన్, రాప్తాడు సత్తిరెడ్డి, మామిళపల్లి హరినాథ్‌రెడ్డి, బాలపోతన్న, నాగముని, తిరుపాల్‌రెడ్డి, భానుకోట శివ పాల్గొన్నారు.

వైభవంగా సిడిమాను ఉత్సవం



సిద్దుల కొండపై వెలసిన రససిద్దేశ్వరస్వామి దర్శనం కోసం క్యూకట్టిన భక్తులు



రససిద్దుల కొండపై అశేష భకుల మధ్య సిడిమానుకు బాలుడ్ని తిప్పుతున్న దృశ్యం

రాయదుర్గం టౌన్: స్థానిక రససిద్దుల కొండపై వెలసిన రససిద్దేశ్వరస్వామి ఉత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం సిడిమాను ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటలకు సిడిమానుకు బాలుడిని కట్టి తిప్పారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అలాగే మున్సిపల్ కార్యాలయ సీనియర్ అకౌంటెంట్ ఈశ్వర్ స్నేహబృందం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

మూగజీవాలపై ఖాకీ ప్రేమ



కుక్కకు బిస్కెట్లు పెడుతున్న హెడ్‌కానిస్టేబుల్ చెన్నమయ్య

ధర్మవరం అర్బన్: మూగజీవాల ఆకలి దప్పికలు తీర్చేందుకు ప్రతి నెలా తన జీతంలో నుంచి రూ.8వేలకు పైగా ఖర్చు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. ధర్మవరంలోని వన్‌టౌన్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ చెన్నమయ్య. రోజూ తన పీఎస్ ఆవరణలో సంచరిస్తున్న వీధి కుక్కలకు బిస్కెట్లు, పెడిగ్రీ, చికెన్ స్టిక్స్ తదితర ఆహారాన్ని అందజేస్తుంటారు. ఆహారం కోసం మూగజీవాలు అలమటిస్తుంటే చూడలేక కొన్నేళ్లుగా తన సొంత డబ్బుతో వాటి ఆకలి దప్పికలు తీరుస్తున్నట్లుగా ఆయన తెలిపారు.